
# సిసింద్రీలు

## (మినీ కవితలు)



కేతవరపు రాజ్యశ్రీ

# సచివుల మధ్య వికసించిన కవితా సుమం రాజశ్రీ

మాటల్లోనే కాదు చేతల్లోనూ అభ్యుదయాన్ని, ఆధునికతను చూపిస్తున్న మహిళామణి కేశవరపు రాజ్యశ్రీ. రాష్ట్ర పరిపాలనకు గుండెకాయలాంటి సచివాలయానికి తొలిసారిగా బైక్‌పైన, కారుపైన వచ్చి ఇతర ఉద్యోగుల్లో స్వాభిమానాన్ని పెంచిన నిత్య చైతన్య శీలి రాజ్యశ్రీ.

భర్త ముందు పోతే/ సాంఘిక కట్టుబాట్లతో వేధించే బంధువులు/ తానే ముందుపోతే / కాటికి పంపడానికి వంతులు పోయే సంతానం/ అన్నింటినీ భరిస్తూ - అన్నింటినీ అధిగమిస్తూ/ పొలం నుంచి - గగన తలం వరకు / సర్వత్రా తానైన సహస్రావధాని -ఆమె అని సమాజంలో స్త్రీ వ్యక్తిత్వాన్ని సునిశితంగా చెప్పారు ఆమె. ప్రస్తుతం వృత్తి రీత్యా రాష్ట్ర సాధారణ పరిపాలనా విభాగంలో ఉప కార్యదర్శి గా పని చేస్తూ, ప్రవృత్తి రీత్యా సాహిత్య సేవ చేస్తున్నారు. ఎక్కడ కవి సమ్మేళనాలు జరిగినా ముందుండే రాజ్యశ్రీ లోని సాహితీవేత్తను తట్టిలేపింది ఉగాది కవి సమ్మేళనాలే మరి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.కాం పట్టభద్రురాలైన రాజ్యశ్రీ కుటుంబ నేపథ్యం పూర్తిగా సంగీత, సాహిత్యాలతో ముడిపడివుంది.

తాత మహాకాళి వెంకటేశ్వరరావు విద్వాన్ బిరుదాంకితుడు, కవి, బహుభాషాకోవిదులు, అందులోనూ చెళ్లపిళ్ల వారి శిష్యుడు. నాన్న వెంకట్రావు కవి, నటుడు, నాటక రచయిత, జ్యోతిష్య శాస్త్ర పండితుడు. అమ్మ ప్రభావతి వీణావాద్య విద్వాంసురాలు. ఇలా నాన్న సాహిత్యం, అమ్మ సంగీత నేపథ్యంలో పెరగడం వల్ల రాజ్యశ్రీకి సహజంగానే సంగీత సాహిత్యం అబ్బింది. 1977లో సచివాలయంలో స్టెనోగ్రాఫంగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. సచివాలయ ఉద్యోగుల ప్రోద్బలంతో కవి సమ్మేళనాలలో పాల్గొనడం వల్ల అప్పటి వరకు మనసు పొరల్లో దాగున్న కళ నిద్రలేచింది. సహజంగానే ఉన్న ఆసక్తికి తోడు ఓ వేదిక దొరకడంతో రాజ్యశ్రీకి ఇక వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాలేదు.



కేశవరపు రాజ్యశ్రీ

ఆమె కథల్లో సామాజిక స్పృహ ఉంటుంది, ఆర్తి ఉంటుంది. స్త్రీలు పడే ఇబ్బందులు చెప్పే తీరులో ఒక ఆవేదన తొణికిసలాడుతుంది. అంతేకాదు భావి పౌరుల భవితనీ/ భారతీయ సంస్కృతిని/ కాపాడేది స్త్రీ అనే భరోసా ఉంటుంది. మరో రకంగా అది విడిపించుకోని స్త్రీ బాధ్యతగా పేర్కొంటారు రాజశ్రీ.

స్టెనోగ్రాఫర్‌గా తన ప్రతిభను నిరూపించుకుంటూ ఉద్యోగంలో పదోన్నతులు పొందుతూనే సాహితీవేత్తగా తన కృషిని ఓ వైపు, సమాజసేవ చేస్తూ మరోవైపు బహుముఖీన ప్రజ్ఞను కనబరుస్తున్నారు. 1983లోనూ, 1991లోనూ ప్రైవేటు కార్యదర్శిగా, గెజిటెడ్

## వృత్తి-ప్రవృత్తి

ఉద్యోగిగా పదోన్నతి, 2006లో అసిస్టెంట్ సెక్రెటరీ, 2010లో డిప్యూటీ సెక్రటరీగా పదోన్నతి వచ్చింది. కుటుంబ జీవితానికే మొదటి ప్రాధాన్యతనిచ్చానని, అయినా ఉద్యోగానికి నిర్లక్ష్యంచేయలేదని అంటున్నారు రాజ్యశ్రీ. ఉద్యోగంలో చేరిననాటి నుంచి సాహిత్యసేవ చేస్తున్నప్పటికీ తన తొలి కవిత 'మేఘమాల' 1997లో తేజోప్రభ పత్రికలో వచ్చిందని, తన కవిత ముద్రితమైనప్పటి నుంచి రెట్టించిన ఉత్సాహంతో సాహిత్య సేవలో కొనసాగారు. ఇప్పటి వరకు తన స్వీయ కవితలతో 'చిరునవ్వులు', గుండె చప్పుళ్ళు', 'ఊహల వసంతం' అనే మూడు పుస్తకాలను, 'కవితా చేతన', 'చేతన కథాఝరి' రెండు కథా సంకలనాలను, 'గృహ హింస చట్టం - మహిళకు రక్షణ కవచం' అనే అవగాహన గ్రంథాన్ని తన స్వీయ ప్రతిభతో వెలువరించారు. ప్రవృత్తిని వృత్తితో కలిపి పనిచేస్తే వృత్తిని ఆహ్లాదంగా, ఉత్సాహంగా చేయగలుగుతామని, వృత్తిని ప్రేమిస్తామని రాజ్యశ్రీ అంటున్నారు. తన రచనల్లో స్త్రీవాదాన్ని ప్రతిబింబిస్తూనే సమాజ హితాన్ని అభిలషిస్తారు. సమాజంలోని అసమానతలు రూపుమాపాలని కోరుకుంటారు. చిన్నప్పటి నుండి అభిమాన కథానాయకుడు అక్కినేని నాగేశ్వరరావు చేతుల మీదుగా సన్మానం అందుకోవడం జీవితంలో మరువలేని విషయం అంటారు రాజ్యశ్రీ. సచివాలయంలో మహిళా ఉద్యోగుల సంక్షేమానికి కూడా ఆమె ఎంతో కృషి చేసారు. ఉదాహరణకు మహిళల కోసం గైనకాలజిస్టుని సచివాలయ డిస్పెన్సరీలో ఏర్పాటు చేయడం, స్త్రీలకోసం యోగా, మెడిటేషన్ క్లాసులు నిర్వహించడం, ఉద్యోగినులకోసం ప్రత్యేకంగా కంప్యూటర్ శిక్షణా తరగతులు నిర్వహించడంతో పాటు సదస్సులు ఏర్పాటు చేశారు. ప్రసూతి సెలవును 4 నెలలకు పెంచడానికి చేసిన కృషిలో విజయం సాధించారు. జంట నగరాలలోని ప్రముఖ సాంస్కృతిక సంస్థలన్నింటిచే సన్మానాలు అందుకున్న రాజ్యశ్రీ భవిష్యత్తులో మరిన్ని సాహితీ శిఖరాలు అందుకోవాలని అభిలషిద్దాం.

◆ ముప్ప అశ్వధకుమార్ రెడ్డి


**మా చిరునామా:**
**శ్రమ,కేరాఫ్ వార్త,జాతీయ దినపత్రిక**
**నం. 396, లోయర్‌టాంక్‌బండ్ రోడ్,**
**హైదరాబాద్ . 500080.**




**ది.03.06.2010 సాహితీ కిరణం వార్షికోత్సవంలో పత్రిక సలహాదారుగా రెవిన్యూశాఖ, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి డా॥ కె.వి. రమణాచారి, ఐ.ఏ.ఎస్. గారి నుంచి మొమెంటో.**



**గిన్నీస్ బుక్ రికార్డు హోల్డరు డా॥ గజల్ శ్రీనివాస్ వారి సతీమణి శ్రీమతి సురేఖ గార్లతో.**

# సిసింద్రీలు

(మినీ కవితలు)

కేతవరపు రాజ్యశ్రీ

ప్రచురణ - 2010

**సిసింద్రీలు (మినీ కవితలు)**

**కె. రాజ్యశ్రీ**

*ప్రథమ ముద్రణ:* **డిసెంబరు, 2010**

*కాపీలు:* **500**

**హక్కులు రచయిత్రివి**

*వెల:* **రూ. 40/-**

*గ్రంథాలయ ప్రతి:* **రూ. 50/-**

*ప్రతులకు:*

**శ్రీమతి రాజ్యశ్రీ**

ప్లాట్ నెం. 301, గోకుల్ అపార్ట్‌మెంట్స్

స్ట్రీట్ నెం. 4, అశోక్ నగర్, హైదరాబాదు - 500 020.

సెల్ : 96666 36134

*డి.టి.పి:*

**కె. బాలకృష్ణ,** హైదరాబాదు.

సెల్ : 95506 81039

*ముద్రణ :*

**విప్ల కంప్యూటర్ సర్వీసెస్**

*(డిజైనర్స్ & మల్టీకలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్)*

నల్లకుంట, హైదరాబాద్-500 044


ఫోన్:040-27654003, 27677078

# విషయ సూచిక


1. పరమార్థం 1
2. క్రికెట్ పిచ్చి 1
3. నైట్ డ్యూటీ 1
4. సమిధ 2
5. ప్రాచీన గ్రంధాలు 2
6. ముఖ్య అతిథి 2
7. విలవిల 3
8. అరటితొక్క 3
9. పూలజల్లు 3
10. కూర్చున కొమ్మ 4
11. సబ్బు 4
12. దాగుడుమూత 4
13. కుంభవృష్టి 5
14. చంద్రవంక 5
15. అరణ్యం 5
16. చట్టం గుడ్డిది 6
17. మత్రివర్యా 6
18. తంగేడుపూలు 6
19. ఆసరా 7
20. నగరం 7
21. ధరలు 7
22. పనిబాగుంది 8
23. తల్లి ప్రేమ 8
24. సుఖ దుఃఖాలు 8
25. ఉపశమనం 9
26. ఆత్మీయులు 9
27. మేటి 9
28. సభలో 10
29. పిచ్చుక గూళ్ళు 10
30. కవల పిల్లలు 10
31. రోలు రోకలి 11
32. పరిష్కారం 11
33. కవి సమ్మేళనం 11
34. నిర్మోహత్వం 12
35. రాజ భోగం 12
36. ఇంట గెలిచి 12
37. ప్రతిబింబం 13
38. ఆక్సిజన్ 13
39. కొత్త భాష్యం 13
40. ప్రాంతం 14
41. ముగ్గు 14
42. అభాగ్యులు 14
43. చలనం 15
44. ఒక్కడే 15
45. కష్టేఫలి 15
46. ద్వందనీతి 16
47. సోపానం 16
48. పోటీ 16
49. ఉప్పునీరు 17
50. కొత్త పరిచయాలు 17
51. కల్పన 17
52. లోయ 18


53. దేశీయత 18
54. గిరాకీ 18
55. సూచన 19
56. బాస 19
57. దొందూ దొందే 19
58. గుప్పెడంత 20
59. తృప్తి 20
60. ఒకరికొకరు 20
61. పదోక్లాసు 21
62. రొమ్ము విరుచుకొని 21
63. ఓర్పు 21
64. విభజన 22
65. రాబందులు 22
66. పరోపకారం 22
67. మచ్చిక 23
68. పిల్లికి చెలగాటం 23
69. నింద 23
70. పదోన్నతులు 24
71. చేసుకున్నవాడికి 24
72. భీతావహుడు 24
73. ఆవేదన 25
74. రెండు వైపులా 25
75. ఆత్మీత 25
76. తలపాగా 26
77. నిబ్బరం 26
78. దివా రాత్రులు 26
79. జ్వలనం 27
80. కులగజ్జి 27
81. ప్రవృత్తి 27
82. వడలిన కుసుమం 28
83. సహజీవనం 28
84. యథారాజా 28
85. మల్లె మొగ్గ 29
86. గోడు 29
87. నీ వంతు 29
88. స్వాంతన 30
89. నిర్భయం 30
90. రంగు 30
91. మౌనం 31
92. భోళా శంకరుడు 31
93. త్యాగధనులు 31
94. తొందరపాటు 32
95. ఊట 32
96. గురివిందగింజ 32
97. అగ్రవర్ణం 33
98. ఊహల్లో 33
99. బ్రతుకు తెరువు 33
100. 'సూట్'కాసులు 34
101. సమ సమాజం 34
102. అదే పదివేలు 34
103. పక్షపాతం 35
104. ఖాళీ జాగ 35
105. ఓదార్పు 35
106. ఆరెంటి నుంచి 36
107. సెల్లు ఘుల్లు 36
108. చరిత్రలో చోటు 36

# అంకితం



సత్కరింపబడటంకన్నా, సత్కరించడంలోనే
అమితానందం పొందే మంచి మిత్రులు,
శ్రేయోభిలాషులు, కళాసేవే పరమావధిగా
కళా హృదయాలలో సుస్థిరస్థానం సంపాదించుకున్న
కళావశిష్ట, కళామైత్రేయ
శ్రీ గుదిబండి వెంకటరెడ్డిగారికి.

# రవ్వలు రాల్చే సిసింద్రీలు



లఘు కవితా రూపాల్ని ఈనాడు విస్తృతంగా వినియోగిస్తున్నారు. మంచి కవులుగా తయారు కాదలిచిన వారికి, ఇవి సోపానాలుగా ఉపయోగపడవచ్చు; లేదా కవితా సృజనలో ప్రత్యేక కోణాన్ని ప్రతిభావంతంగా వినియోగించగలవారికి వాహికకావచ్చు. ఎందుకంటే, లఘు రూపాలకు వాటి ప్రత్యేకత, ఏకాలంలోనైనా, ఏదేశంలోనైనా ఉంది. కొద్ది పాదాలలో ఒక పెద్ద వస్తువును మడిచిపెట్టడమనేది గొప్ప ప్రతిభకు సంబంధించిన విషయమే. చాటువులుగాని, వేమన శతకంలాంటి ముక్తకాలుగానీ, ఉర్దూ షేర్లుగానీ, జపాను హైకూలుగానీ, ఎన్నెన్నో ఇందుకు నిదర్శనం. ఒక్కొక్క రూపం, సాధారణంగా ఒక్కొక్క వస్తువుకి మంచి వాహికఔతుంది. మినీ కవితలో సామాజిక, హైకూలో అనుభూతి రెక్కల్లో తాత్వికత-గమనించగలం. అయితే, క్రమ పరిణామంలో ఏ రూపమైనా వస్తు విస్తృతికి దారి తీస్తుంది. కేతవరపు రాజ్యశ్రీ 'సిసింద్రీలు' మినీ కవితల్లో సామాజికతయే ప్రధానంగా ఉంది. అక్కడక్కడ మిగిలిన వస్తువులు కూడా కనిపిస్తై.

సామాజిక వస్తువును స్వీకరించడంలో, ఈనాడు మనం ప్రతినిత్యం గమనించే ఎన్నో అంశాలు రాజ్యశ్రీ మినీ కవితల్లో కనిపిస్తై. ఒక కవితలో ఆమె అన్నారు.

అక్షరాలు
వెంటపడి వేధిస్తున్నాయి
తమను ఆయుధంగా చేసుకుని
సమాజపు కుళ్ళును
కూకటి వేళ్లతో
పెకిలించివేయమని

సమాజపు కుళ్ళును పెకలించేలక్ష్యంతో, సామాజికతను నింపుకున్నానని చెప్పారు. కాబట్టి సామాజిక వైరుధ్యాలు ముఖ్యమని ఆమె ఉద్దేశం.

ఈనాటి సమాజపు కుళ్ళులో ప్రధానమైన అంశం పాశ్చాత్యీకరణ. పాలకవర్గం దగ్గర నుండి, వార్తా మాధ్యమాల వరకు, ఇదే లక్ష్యమని ప్రబోధిస్తూ, ప్రోత్సహించడం ఆత్మహత్యాసదృశం. చిన్నప్పటి నించి స్త్రీ పురుషులు కలిసి విచ్చలవిడిగా ఉండాలన్నది పాశ్చాత్యీకరణలోని అత్యంత హేయమైన విషయం. ఇది ఎలా ఆత్మహత్యా సదృశమౌతుందో, వాస్తవికత ఆధారంగా కవయిత్రి చెప్తున్నారు. ఈ కవిత శీర్షిక 'పదోక్లాసు'

**'పదో క్లాసు'**
**సినిమా తీసి**
**కాసులు దండుకున్నాడు**
**ఒక అడుగు ముందుకేసి**
**ఎనిమిదో క్లాసులోనే**
**ప్రేమలో పడి చూపించారు**
**అతని పిల్లలు**
**ఎవరు తీసిన గోతిలో**
**వారే పడతారు మరి**

ఫ్యాషన్ షోలు, రియాల్టీషోలు, పిల్లినడకలు, అసభ్యనృత్యాలు - మొదలైన వాటిలో చిన్న పిల్లల్నిగూడా, వ్యాపారాత్మకంగా వినియోగించడం, ఎంత ప్రమాదమో ఈ కవితను బట్టి ఊహలోకి వస్తే. సాంస్కృతిక అత్మహత్య వైపు దేశం వెళ్తోందన్న ఒక ఆవేదన కనిపిస్తుంది.

ప్రపంచీకరణ వలన వచ్చిన అనర్థాలలో ఒకటి మనకు సంబంధించిన వాటిని విదేశీయులు 'పేటెంట్' చేసుకోవడం. ఇంతవరకు దేశాభిమాన శూన్యతతో మనం తక్కువగా చూచిన వాటిల్లో,

ఎంత గొప్పతనముందో పాశ్చాత్యులు గమనించి, వాటిని వ్యాపారం కోసం సొంతం చేసుకోవడం గొప్ప విషాదం. ఆ అంశాన్ని 'దేశీయత' అన్న కవితలో చెప్తున్నారు.

**పెరటి చెట్టు**
**మందుకు పనికిరాదు**
**విదేశీయుడు దాన్ని**
**పేటెంట్ చేయగానే**
**తెల్ల మొహం వేయు**

''పెరటి చెట్టు మందుకు పనికిరాదు'' అనే సామెతని వినియోగించడం ఇందులోని విశేషం. పెరటి చెట్టంటే 'వేప చెట్టు'. వేప చెట్టులోని ఔషధ గుణాన్ని భారత దేశీయులు ఎప్పుడో గమనించినా, ఇప్పుడు పేటెంట్ పొంది విదేశీయుడు మందులు తయారు చేసి మనకే అమ్ముతాడు. ఇంతకాలం మనం అనాసక్తతతో ఉండి, ఎవరో పేటెంట్ తీసుకోగానే తెల్ల మొహం వేస్తాము.

స్త్రీల పరిస్థితిపై రాజ్యశ్రీ రాసిన మినీ కవితలు, సమకాలీనతను ప్రతిఫలిస్తున్నై. 'రోలు రోకలి' అనే కవితలో ఇలా అంటారు.

**రోలు రోకలి**
**మాయం**
**మిక్సీల**
**సాయం**
**అతివ**
**సొంతం**
**భారమైన**
**కాయం**

ఒక్కొక్క పదం ఒక్కొక్క పాదంగా రాయడంలో, మాయం, సాయం, కాయం అనేవాటి అనుప్రాస కుదిరి, రూపం ఒక చమత్కారాన్ని స్ఫురింపజేస్తుంది. 'రోలు రోకలి' సమస్త శ్రమకూ సంకేతం, మిక్సీలు

అన్ని యంత్రాలకీ సంకేతం. శ్రమపడడం పూర్తిగా పోవడం వలన, శరీర భారం పెరిగిపోవడం, కళ్ళ ఎదుట చూస్తున్న సత్యం. ఒక అనివార్య పరిణామమే కావచ్చు గాని, శ్రమ విలువను ధ్వనింప జెయ్యడం ఈకవితలోని అంతరార్థం.

'రెండువైపుల' అనే మినీ కవితలో స్త్రీ పట్ల సమాజంలో ఉన్న చిన్న చూపుని శక్తివంతంగా చెప్పారు.

**అన్యాయాన్ని ఎదిరించలేక**
**మౌనంగా రోదిస్తుంటే**
**ధైర్యమిచ్చి**
**ప్రోత్సహించేవారే కరువు**
**ఆదిశక్తిగామారి**
**కరవాలం ఝళిపించితే**
**విమర్శించడానికి**
**ముందుంటారు**

అణిగి ఉన్నా, ఎదురు తిరిగినా - రెండు పరిస్థితుల్లోనూ స్త్రీకి జరుగుతున్న అన్యాయాన్ని చెప్పడం గమనించగలం. ఇది చాలా సమకాలీన భావం.

మనోహరమైన ప్రకృతి చిత్రాన్ని చెప్తూ, మానవ చైతన్యాన్ని పరోక్షంగా స్ఫురింపజేసే కొన్ని కవితలు ఈ సంపుటిలో కనిపిస్తే 'తల్లిప్రేమ' అన్న మినీ కవిత ఇది.

**అమావాస్య చంద్రుడు**
**ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ**
**పరిపూర్ణుడవుతాడు**
**పౌర్ణమినాటికి**
**అతడి శ్రమకు ఫలితం దక్కిందని**
**ఎగిసిపడే అలలతో**
**సంతోషం తెలియచేస్తుంది**
**సంద్రం**

పున్నమినాడు ఎగసిపడే అలలకు కారణాన్ని ఊహించడంలో ఇది ఉత్ప్రేక్ష అనే అలంకారం ఔతుంది. ఇందులో శ్రమకు ఫలితం దక్కించుకున్న ఒక వ్యక్తి ఉన్నాడు. చంద్రుడికి సముద్రం తల్లి వంటిది కనుక, కొడుకుపైకి రావడంతో సంతోషించిన తల్లి ఉంది. మానవ చైతన్యం ప్రకృతికి అన్వయించి చెప్పిన కవిత యిది.

మినీ కవిత - ఉద్భవించినప్పటినుండి, క్రమక్రమంగా అనేక అభివ్యక్తిరీతుల్ని సొంతంచేసుకుంది. వాటిలో కొన్ని రాజ్యశ్రీ కవితల్లో కూడా స్పష్టంగా కనిపిస్తై. ఉదాహరణకి రెండిటిని గూర్చి చెప్తారు. మొదటిది, మినీ కవితలోని పాదాన్ని ఖచ్చితంగా రెండు భాగాలుగా విభజించి, వ్యతిరేకతనుగానీ, సామ్యాన్నిగానీ, మరోరీతిలోగానీ చెప్పి, భావాన్ని స్ఫురింపజెయ్యడం. ఉదాహరణకి 'గిరాకి' అనే కవితను తీసుకోవచ్చు.

**ఎన్ని హైక్లాసు**
**పింగాణీ ప్లేట్లు వచ్చినా**
**విస్తరాకులకు**
**గిరాకీ తగ్గలేదు**
**ఎన్ని ఆధునిక**
**యంత్రాలొచ్చినా**
**కూలివాడి**
**అవసరం తరగలేదు.**

ఇది నాలుగేసి పాదాలు రెండు భాగాలుగా విభజింపబడిన మినీ కవిత. రెంటిలో ఒక పోలిక ప్రధానం. విస్తరాకుల్లో దేశీయత, కూలివాడిలో శ్రమవ్యక్త మౌతున్నై. విస్తరాకుల్లోనూ శ్రమ ముఖ్యమే. మొత్తం మీద దేశీయతలో భాగమే శ్రమ. శ్రమను నాశనం చేసే ఎంత విదేశీయత, ఎన్ని యంత్రాలూ వచ్చినా, దేశీయత, శ్రమ ధ్వసం కాలేదని చెప్పడం వల్ల దేశీయత శ్రమనాశనం కాకూడదని యిచ్చే సందేశం కూడా గర్భితంగా ఉంది.

మినీ కవితలో ఒకే పదాన్ని రెండర్థాల్లో వాడే వైచిత్రి ఒక విధానం. 'ప్రాచీన గ్రంథాలు' అనే మినీ కవితలో రాజ్యశ్రీ యిలాంటి ప్రయత్నం చేశారు.

**గ్రంథాలయంలోని**
**ప్రాచీన గ్రంథాలు**
**నేటి తరానికి**
**జీర్ణంకానివి**
**కీటకాలు చదివి**
**జీర్ణించుకునేవి**

నేటి తరానికి 'జీర్ణం' కానివి అనడంలో అర్థంకావనీ, కీటకాలు జీర్ణించుకునేవి అంటే తిని జీర్ణించుకునేవి అనీ అర్థాలు స్పష్టమే. 'కీటకాలు చదివి' అనడంలో వ్యంగ్యం ఉంది. మనుషులు చదవడం లేదన్నది భావం.

మినీ కవితాభివ్యక్తి మార్గాల్ని యింకా పెంపొందించుకుని, నవ్య భావాల్ని ప్రతిఫలిస్తూ, ప్రతి కవితలో ఏదో ఒక విశిష్టతను ప్రదర్శిస్తూ, ఉత్తమస్థాయి కవయిత్రి కావాలని కేతవరపు రాజ్యశ్రీని అభినందన పూర్వకంగా కోరుతున్నాను.

(అద్దేపల్లి రామమోహనరావు)
ప్రముఖ రచయిత-సాహితీ విమర్శకులు

# కృతజ్ఞతలు

ఇంతకు ముందు నేను రాసిన "చిరుసవ్వడులు", గుండె చప్పుళ్ళు" నానీల కవితా సంకలనాలు. వీటిలో అక్షర నిబద్ధత వుండటం వలన భావాన్ని కుదించి రాయడం జరిగింది. భావాలను విస్తృతపరుస్తూ "ఊహల వసంతం" అనే వచన కవితా పుస్తకాన్ని కూడా రచించాను.

తరువాత నాలో అప్పుడప్పుడు చోటు చేసుకున్న చిరుభావాలను అక్షరాలుగా మార్చి, ఒకచోట చేర్చినవే ఈ "సిసింద్రీలు" అనే మినీ కవితలు.

వీటికి పుస్తక రూపమివ్వడానికి సాహితీ ప్రముఖులు, స్నేహశీలి, సహృదయులూ అయిన అద్దేపల్లి రామమోహనరావుగారి సలహా కోసం వారికి పంపడం, వారు చక్కని సూచనలిస్తూ, "రవ్వలు రాల్చే సిసింద్రీలు" అంటూ ముందుమాట రాసి నన్ను ప్రోత్సహించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. వారికి నా ధన్యవాదాలు.

అక్షరాలను తీర్చిదిద్దడమే కాకుండా నా "సిసింద్రీలు" ఫణీంద్ర, ప్రియాంకల చిన్ననాటి చిత్రాలను ముఖచిత్రంగా రూపొందించి అందంగా మలిచిన డి.టి.పి. ఆపరేటర్ శ్రీ కె. బాలకృష్ణకు నా కృతజ్ఞతలు.

ఈ "సిసింద్రీలు" పుస్తకంగా వెలువడడానికి సహకరించిన హితులకు, సన్నిహితులకు, నా పి.ఎ. శ్రీమతి సంధ్యకు ధన్యవాదాలు.

**కేతవరపు రాజ్యశ్రీ**

## పరమార్థం

పువ్వు
వికసిస్తే
గాలంతా
పరిమళం
సజ్జనుడి
సహవాసం
చూపించు
పరమార్థం

## క్రికెట్ పిచ్చి

పక్షులకి కూడా
క్రికెట్ పిచ్చి
సిక్సర్ కొట్టగానే
సంతోషంతో
రివ్వున ఎగిరి రెక్కలు
టపటపలాడిస్తూ
చప్పట్లు కొడతాయి

## నైట్ డ్యూటీ

నైట్ డ్యూటీ దిగుతూ
తనని తట్టి లేపిన
చంద్రుడి మీద అలిగి
ఎరుపెక్కిన మోముతో
తూరుపు కొండెక్కి
కూచున్నాడు సూరీడు

## సమిధ

గమ్యం చేర్చడంలో
ఆర్.టి.సి. బస్సు
ముందుంటుంది
నిరసనకారుల
ఆగ్రహానికి
మొట్ట మొదటి
సమిధ కూడా అదే

## ప్రాచీన గ్రంథాలు

గ్రంథాలయంలోని
ప్రాచీన గ్రంథాలు
నేటి తరానికి
జీర్ణంకానివి
కీటకాలు చదివి
జీర్ణించుకునేవి

## ముఖ్య అతిథి

ఖద్దరు తొడిగి
గాంధేయ వాదిగా
ముద్రవేయించుకున్నాడు
బ్రాందీ షాపు
ప్రారంభోత్సవానికి
ముఖ్య అతిథి
అతడే!

## విలవిల

ఎండాకాలం తహతహ
వానాకాలం చితచిత
చలికాలం విరవిర
అన్ని కాలాల్లోనూ
మనిషి విలవిల

## అరటితొక్క

పక్క చూపులు చూస్తూ
తనని తొక్కిన వాడి
నడ్డి విరగ్గొట్టి
తిక్క
కుదురుస్తుంది

## పూలజల్లు

ఎండలో మలమల మాడి
నిర్మానుష్యమయిన రోడ్డు
వెలవెల
వుమెన్స్ కాలేజీ వదలగానే
పూలజల్లు కురిసినట్లు
కళకళ

## కూర్చున్న కొమ్మ

మేధ
మహాపిచ్చిది
తన తెలివితేటలతో
మారణాయుధాలను
సృష్టించి
తన వినాశనాన్ని
తానే కొనితెచ్చు కుంటోంది
కూర్చున్న కొమ్మను
నరుక్కుంటోంది

## సబ్బు

పరులమురికిని
శుభ్రం చేస్తుంది
తానుమాత్రం
మలినం
అంటించుకోదు

## దాగుడుమూత

మబ్బు వెనక
దాగిన
సూరీడు
మబ్బు అంచుకు
జరీ బార్డరు

## కుంభవృష్టి

కారు చీకట్లని
కప్పుకున్న మబ్బులు
కుంభవృష్టికి
సిద్ధంగా
ఆమె
మనసులాగే

## చంద్రవంక

ఆకాశాన
చంద్రవంక
మారాం చేసే
చంటోడికి
బువ్వ తినిపించే
వెన్నెల వంక

## అరణ్యం

ఆకుపచ్చని దాహంతో
అరణ్యం
గొంతెండిపోయి
సెగలు కక్కుతోంది
పట్టణానికి
దీటుగా

## చట్టం గుడ్డిది

న్యాయనిర్ణయం
చేసేవారే
బాహా బాహీ
కుస్తీలు
అందుకేనేమో
న్యాయ దేవత
కళ్ళకు గంతలు

## మత్రివర్యా

మా వీధికి
పాదయాత్రకు రారూ?
వీధి దీపాలు
కుళాయి నీళ్లు
తక్షణమే
సాంక్షన్ మాకు

## తంగేడు పూలు

పట్టు చీరల రెపరెపలతో
పేరంటాళ్ళు
సందు గొందుల్లో
పూసిన
తంగేడుపూలు

## ఆసరా

కలతలను
మరువడానికి
మద్యపానము
నీకు ఆసరా
మత్తులో మునిగి
వెతల పాలు చేసిన
ఆలు బిడ్డల
కేదీ ఆసరా?

## నగరం

అడవి
అన్నల రాజ్యం
నగరం
నాగరికులకు
భోజ్యం

## ధరలు

నింగికెగసి
చుక్కలతో
ముచ్చట్లలో పడి
కిందకి
దిగిరానంటున్నాయి

## పనిబాగుంది

కిరాయి జనం
పని మూడు పువ్వులూ
ఆరుకాయలు
పార్టీ భేదం చూపకుండా
అన్ని బహిరంగ సభలనూ
విజయ వంతం చేస్తూ
సొమ్ము చేసుకుంటున్నారు
ధనమూల మిదం జగత్

## తల్లి ప్రేమ

అమావాస్య చంద్రుడు
ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ
పరిపూర్ణుడవుతాడు
పౌర్ణమినాటికి
అతడి శ్రమకు ఫలితం దక్కిందని
ఎగిసిపడే అలలతో
సంతోషం తెలియచేస్తుంది
సంద్రం

## సుఖ దుఃఖాలు

కొన్ని
చూపులు
గులాబీల్లాగా
అందంగా వుంటాయి
ముళ్లలాగే
గుచ్చుకుంటాయి కూడా

## ఉపశమనం

తన ఓటమికి
ఏదో ఒక సాకు
చూపించి
ఉపశమనం
పొందుతారు
ఆత్మను సంతృప్తి
పరచడం కోసం

## ఆత్మీయులు

ఎన్నికల్లో
ఓడితే ఓడాం
కానీ
ఆత్మీయులెందరున్నారో
తెలిసిందన్న
తృప్తి మిగిలింది

## మేటి

ద్రోణుడు ద్రోహి!
కాబట్టే
ఏకలవ్యుడు
ఖ్యాతిగడించాడు
సాటిలేని మేటి
విలుకాడిగా

## సభలో

'స్త్రీ' ని
అందలమెక్కిస్తూ
ఉపన్యాసం
ఇంటి ఇల్లాలికి
మాత్రం
దాన్నించి
మినహాయింపు

## పిచ్చుక గూళ్ళు

ఇసుకతిన్నెల్లో
పిచ్చుకగూళ్ళు
భవిష్యత్తులో
ఇల్లు కట్టడానికి స్ఫూర్తి
అక్కడనుంచే మొదలు

## కవల పిల్లలు

భాగ్యం ఒకటేకాదు
భోగం కూడా
వున్నపుడే
దానికి విలువ
అందుకే భోగభాగ్యాలతో
తులతూగమని
దీవిస్తారు పెద్దలు

## రోలు రోకలి

రోలు రోకలి
మాయం
మిక్సీల
సాయం
అతివ
సొంతం
భారమైన
కాయం

## పరిష్కారం

నన్ను కన్నవాళ్లు
నేను కన్నవాళ్లు
సమస్యాభారం
నా మీద మోపి
నిశ్చింత పొందుతారు
నా చింతలకు సమాధానం
ఒక్క మరణం దగ్గరే

## కవి సమ్మేళనం

కవులతో
కళకళలాడుతోంది
కవిసమ్మేళన వేదిక
ఖాళీ కుర్చీలతో
వెలవెలబోతోంది
సభామందిరం

## నిర్మోహత్వం

పాపాలు పెరుగుతున్నట్లుగానే
బాబాలు పెరుగుతున్నారు
భక్తులు తండోపతండాలు
ఆశ్రమాలు కోకొల్లలు
స్వామిజీ నిర్మోహత్వం బోధిస్తున్నా
కోరికలతోనే
కొలుస్తున్న జనం

## రాజ భోగం

పాచిపోయిన అన్నం పెట్టినా
వీధి కుక్క విశ్వాసంగా
యింటిని కాపలాకాస్తుంది
మటన్ పెట్టి
షాంపూతో షవర్ బాత్ చేయించి
ఎవరినీ కరవకుండా
కట్టేసివుంచి కాపలాకాయాలి
ఆల్సేషియన్ డాగ్‌ని

## ఇంట గెలిచి

వ్యంగ్య చిత్రాల
కార్టూనిస్టు
అతడి ఇంట
ఆ వ్యంగ్యాలే
నిజాలు

## ప్రతిబింబం

విమెన్స్ కాలేజీ దగ్గర
పడిగాపులు
అందగత్తె క్రీగంట
చూపుకోసం
తమ సంగతేమిటో
అద్దంలో చూసుకోరు

## ఆక్సిజన్

భోజనాల కెళ్లేటప్పుడు
చేతిలో 'కిన్ లే' వాటర్ బాటిల్
ఆక్సిజన్ సిలిండర్
ముక్కుకి తగిలించుకెళ్లే
రోజులు దగ్గరలోనే వున్నాయి

## కొత్త భాష్యం

రోడ్డు డివైడర్‌ని
అడ్డంగా డివైడ్ చేసి
అడ్డ దారిలో వాహనాలు
నడపడమే
హీరోయిజమ్

## ప్రాంతం

వైద్యో నారాయణో హరిః
ప్రాంతీయ తత్వంతో
వైద్యం
నిరాకరించేవారు
వృత్తికే
కళంకితులు

## ముగ్గు

నిన్నటి ముగ్గు మీద
కళ్లాపి చల్లి కొత్త ముగ్గు
నిన్నటి కష్టం మీద
నేడు వెయ్యి కొత్త
ఆశలకు పునాది

## అభాగ్యులు

పుట్టుకతో
అంధులు
కొందరు
కళ్ళు
నెత్తిమీదకొచ్చి
మరికొందరు

## చలనం

పొద్దు పొడుపులో వెళ్లిన
పక్షుల కోసం
చలనం లేని చెట్టు
ఎదురుచూపులు
ప్రపంచ వింతలు విశేషాలు
విందామని

## ఒక్కడే

నీటిలోని
సూర్యుడు
తళ తళ
నేలమీద సూర్యుడు
భగభగ

## కష్టేఫలి

కొండెక్కిన
దీపపు వత్తిని
ఎలక మార్చుకుంది
డన్ లప్
పరుపుగా

## ద్వందనీతి

పలక మీద
శాస్త్రోక్తంగా
అక్షరాభ్యాసం
మరునాడే
కాన్వెంట్ స్కూల్లో
కంప్యూటర్ మీద
అష్టావధానం

## సోపానం

అంధ విశ్వాసాల
మీద
పోరాటం
నాయకులవడానికి
అదే ప్రథమ
సోపానం

## పోటీ

చంద్రుడిని
ఓడించాలని
పరుగు లంఘించినా
నాతో సమానంగా
పరుగిడుతున్నాడేమిటా? అని
ఆశ్చర్యం
అమాయక బాల్యం

## ఉప్పనీరు

రెప్ప కింద
కన్నీరు
పెదవులను
ముద్దాడి
ఉప్పొంగి
ఉప్పు సంద్రమయింది

## కొత్త పరిచయాలు

కొత్త పరిచయాల
గుబాళింపు
బహుపసందు
వాటి మోజులో
పాతని మరచిపోకు
అవే ఎప్పటికీ
తీపి గురుతులు

## కల్పన

చంద్రుడిపై
మోపిన కాలు
కవుల కల్పనకు
వేసింది
సంకెళ్ళు

## లోయ

జలపాత ధారల్లో
జలకాలాడుతోంది
లోయ
కన్నీటి వరదల్లో
స్నానిస్తోంది
ఆమె
ఎదలోయ

## దేశీయత

పెరటి చెట్టు
మందుకు పనికిరాదు
విదేశీయుడు దాన్ని
పేటెంట్ చేయగానే
తెల్ల మొహం వేయు

## గిరాకి

ఎన్ని హైక్లాసు
పింగాణీ ప్లేట్లు వచ్చినా
విస్తరాకులకు
గిరాకీ తగ్గలేదు
ఎన్ని ఆధునిక
యంత్రాలొచ్చినా
కూలివాడి
అవసరం తరగలేదు

## సూచన

మంచి శకునం
కాదని
సంశయమేలా!
అనర్థాన్ని
ముందే సూచించి
మేలు
చేసిందేమో!

## బాస

కుల మతాల
కతీతమని
బాస
కుర్సీ ఎక్కగానే
మనోడిమీదే
ధ్యాస

## దొందూ దొందే

మోడు వారిన చెట్టు
చెట్టు నీడ లేని కొండ
కష్టసుఖాలు
పంచుకుంటున్నాయి
రోలు వెళ్లి మద్దెలతో
మొరపెట్టుకున్నట్టు

## గుప్పెడంత

గుండె
గుప్పెడంతే
కానీ
అనంతమైన
ప్రేమను
తనలో
ఇముడ్చుకుంటుంది

## తృప్తి

సంతృప్తి
ఎవరిలోనూ
కనపడటంలేదు
పిన్న నుంచి ముసలివరకు
ఎప్పుడూ ఏదో
కావాలనే
ఆరాటం తప్ప

## ఒకరికొకరు

అతడు
ఆమె
రెక్కలొచ్చి
ఎగిరిపోయిన
పిల్లల
కబుర్లతో
కాలక్షేపం

## పదోక్లాసు

'పదో క్లాసు'
సినిమా తీసి
కాసులు దండుకున్నాడు
ఒక అడుగు ముందుకేసి
ఎనిమిదో క్లాసులోనే
ప్రేమలో పడి చూపించారు
అతని పిల్లలు
ఎవరు తీసిన గోతిలో
వారే పడతారు మరి

## రొమ్ము విరుచుకొని

అవినీతి
పరదా
తొలిగించి
ధైర్యంగా
నీతి మీద
నడుస్తోంది

## ఓర్పు

సహనమూర్తిని
బిరుదు తగిలించి
అరవచాకిరీ సీటులో
ఆమెకు పోస్టింగ్
ఆమ్యామ్యావచ్చే సీటులో
అతడికే అగ్రతాంబూలం

## విభజన

అన్ని కులాలూ నావేనన్నాడు
అన్ని మతాలు ఒకటేనన్నాడు
అన్ని వూళ్ళూ నావేనన్నాడు
ప్రజలంతా నావాళ్ళేనన్నాడు
గెలిచాక
కులాల వారీగా మతాల వారీగా
ప్రాంతాల వారీగా జనాన్ని రెచ్చగొట్టి
విభజించి పాలిస్తున్నాడు

## రాబందులు

సమాజంలో
పేరున్న కవికి
ముళ్ళ కిరీటాలు
బిరుదులు
ఈర్ష్యా అసూయలు
బంధువులు
చదివి ఆనందించేవారు
పాఠకులు

## పరోపకారం

జోగుతున్న
ప్రకృతిని
మేలుకొలుపుతాయి
కిలకిల రావాలతో
పక్షులు

## మచ్చిక

చుక్కలు
పగలు కూడా
మెరవాలని
మగువలను
మచ్చిక చేసుకుని
వారి చీరలకు
అంటుకున్నాయి

## పిల్లికి చెలగాటం

బైకు మీద
ప్రేమ జంట
ముచ్చట్లు
పాదచారి
ప్రాణం
పాపం గుప్పిట్లో

## నింద

టాంక్ బండ్
మోస్తోంది
భాగమతుల
ఆత్మహత్యల
నిలయమనే
అపనింద

## పదోన్నతులు

నియమాలకు
నీళ్లొదిలి
నిబంధనలను
అధికారులకు
అనుకూలంగా
మలిచి
మార్చి రాసేవాడికి
ప్రశంసా పత్రాలు
పదోన్నతులు

## చేసుకున్నవాడికి

పచ్చనోటుతో వల
చిక్కిన చేపకు
కడుపునిండా సారా
ఐదేళ్ళ వరకు
లేవకుండా చెర

## భీతావహుడు

రాకెట్ల సంధానంతో
భీతిల్లి
రోజురోజుకు
కుంచించుకు పోతున్నాడు
వెన్నెలరేడు
(చంద్రుడు చిన్నగా అవుతున్నాడన్నవార్తకు స్పందనగా)

## ఆవేదన

అక్షరాలు
వెంటపడి వేధిస్తున్నాయి
తమను ఆయుధంగా చేసుకుని
సమాజపు కుళ్ళును
కూకటి వేళ్లతో
పెకిలించివేయమని

## రెండు వైపులా

అన్యాయాన్ని ఎదిరించలేక
మౌనంగా రోదిస్తుంటే
ధైర్యమిచ్చి
ప్రోత్సహించేవారే కరువు
ఆదిశక్తిగామారి
కరవాలం ఝళిపించితే
విమర్శించడానికి
ముందుంటారు

## ఆతృత

కొత్త జంట
సరసల్లాపాలు
చూడాలనే ముచ్చటతో
కొబ్బరాకుల మాటు నుంచి
తొంగి తొంగి చూస్తున్నాడు
చంద్రుడు

## తలపాగా

రైతు నెత్తిన ముతక
నేతల తలకు ఘనత
వరుడికి అలంకారం
డాక్టరేట్లకు గౌరవచిహ్నాం
కాకారాయుళ్లకు పనిముట్టు
పండితులకు
ప్రతిభను చాటే మెట్టు

## నిబ్బరం

ఆకురాలి
మోడువారి
కళావిహీనమైయిన
చెట్టు
నిబ్బరంగా నిలుచుంది
వసంతం రాగానే
మళ్లీ చిగురిస్తాననే
ధీమా దానికి

## దివా రాత్రులు

తారల
తళతళలు
చీకటిలోనే
తారామణుల
తళుకు బెళుకులు
దివా రాత్రులు
కూడా

## జ్వలనం

అసూయ
అహంకారాలతో
అందరికీ దూరం
మృత్యువుకి కూడా
జుగుప్స కలిగినట్టుంది
అతడిప్పుడో
జీవచ్ఛవం

## కులగజ్జి

తానా ఆటా సిలికాన్
విదేశంలో మన సంస్కృతిని
చాటి చెప్పే సంస్థలు
అమెరికాకి
కులగజ్జిని
అంటించిన ఘనులు కూడా

## ప్రవృత్తి

వృత్తి రీత్యా
వున్నత స్థానంలో
ఉన్నాడు
ప్రవృత్తి రీత్యా
అందరూ
'ఛీ' కొట్టేవారే!

## వడలిన కుసుమం

పొద్దు పొడుపుతో
భానుడితో పరుగు పందెం
మిట్ట మధ్యాహ్నానికి
అతడు చండప్రచండం
ఆమె వడలిన కుసుమం

## సహజీవనం

ఎన్నో ఏళ్ళుగా
కలిసేవున్నాం
మాటలు మాత్రం
చాలా
పొదుపుగా
వాడతాం

## యథారాజా

ఇది
అతుకులబొంత
ప్రజాస్వామ్యం
సామరస్యం
తెలియని
ప్రజాజీవనం
యథారాజా
తథా ప్రజా

## మల్లె మొగ్గ

సిగ్గుపడి
సిగలోంచి
పక్కకు తొలగింది
ప్రేమ జంట
ముద్దుమురిపాలు చూసి

## గోడు

కడుపు మాడి
గోడు చెప్పుకుంటే
నా ఘోష మీద
కమ్మని భాషలో
కవిత రాసి
సభలో
శెభాషనిపించుకున్నాడు

## నీ వంతు

స్వార్థం, ఈర్ష్య, అసూయ
అంటూ గోలపెట్టకు
నీ మనసులో
వాటికి
చోటీయకు

## స్వాంతన

ఏడుపు
గుండె బరువు తగ్గిస్తుంది
నిట్టూర్పు
ఆ బరువును
బయటకు
పంపుతుంది

## నిర్భయం

అక్షరం వేసిన
పునాది మీద
నిర్భయంగా
నిలబడింది
వ్యక్తిత్వం

## రంగు

రంగు వేసుకుని
ఎందరినో
నా చుట్టూ తిప్పుకున్నా
అసలు రూపు
అద్దంలో
నీ మొహం
చూసుకోమంది

## మౌనం

ఎదుటివాడి
కోపానికి
చెంప పెట్టు
నీ విజయానికి
తొలి మెట్టు

## భోళా శంకరుడు

సాగరం
గలగల మంటూ
ఘోష పెడుతుంది
తన కడుపులో
ఏదీదాచు కోలేదు
అన్నీ
బయట పడేస్తుంది

## త్యాగ ధనులు

అక్షరాలు
రాత్రంతా శ్రమించి
మిషన్ల కింద నలిగి
తెల్లారే సరికి
తాజా వార్తలతో
రెడీ

## తొందరపాటు

ఆలోచనలోంచి
వివేచనపుడుతుంది
అనాలోచనతో
అనే మాటలు
ఒక్కొక్కసారి
బడబాగ్నిని
రగిలిస్తాయి

## ఊట

బావిలో చేదవేసి
తోడిన కొద్దీ నీళ్లు
ఊరుతాయి
మహాత్ముల
జీవితాల నుంచీ
తోడిన కొద్దీ
జ్ఞాన నిధులు

## గురివింద గింజ

కుత్సిత వ్యవస్థ
అని పదే పదే
నిందించకు
దానిలో
నువ్వుకూడా
ఒక భాగమేనని
మరచిపోకు

## అగ్రవర్ణం

మాదిగ కంటే
మాల అగ్రవర్ణమట
వాళ్ల ఇళ్లలో వీళ్లకి
మంచి నీళ్లివ్వరట
అగ్రవర్ణం
అంచెలంచెలు

## ఊహల్లో

పెళ్లికి ముందే
అబ్బాయి అమ్మాయి
భావి జీవిత కలల్లో
విహారం
మూడు ముళ్ళు పడగానే
వాస్తవంతో
రాజీ పడలేక
కీచులాటలు
ఆపై విడాకులు

## బ్రతుకు తెరువు

హైటెక్ ఆసుపత్రులు
రకరకాల
ప్యాకేజీలతో
రోగులను
ఆకర్షించే
వ్యాపార సంస్థలు

## 'సూట్' కాసులు

రాష్ట్రంలో పాలన
భాగ్యనగరం నుంచి
ఇంద్రప్రస్థానికి
'సూట్'కాసుల
నివేదన

## సమ సమాజం

కార్తీక మాసం
వనభోజనాల సందడి
కులాలవారీగా
సహపంక్తి
భోజనాలకు
వార్తాపత్రికల ద్వారా
ఆహ్వానాలు

## అదే పదివేలు

పార్టీలో సీటు దక్కక
ఇండిపెండెంటుగా పోటీ
గెలుపు ఎటూరాదు
విత్‌డ్రా అయినందుకు
లాభసాటి బేరమన్నా
కుదురుతుంది

## పక్షపాతం

పసికందును
కడదేర్చిన
కసాయి తల్లని
ఈసడించే సమాజం
తల్లిని చేసి
తప్పించుకున్న
కసాయి తండ్రి గురించి
నోరు మెదపదు

## ఖాళీ జాగా

ఆ ఖాళీ జాగాకు
కంచెలాంటి వాణ్ణి
ఆకాశ హర్మ్యాల
నిర్మాణం
పూర్తికాగానే
ఆ జాగా ఖాళీ చేయాలి

## ఓదార్పు

మేఘాల ఆలింగనం చూచి
ఆకసం ఒక్క ఉరుము ఉరిమింది
భీతావహులై అవి
కార్చిన కన్నీటిని
నేల తల్లి ఆర్తిగా
తన గుండెలో
ఇముడ్చుకుంది

## ఆ రెంటి నుంచి

నెత్తిమీద సూరీడు
నిప్పులు కురిపిస్తున్నాడు
కాళ్ళను నిప్పుల మీద
నడిపిస్తోంది భూదేవి
ఆ రెంటినుంచీ
రక్షించేది చెట్టు

## సెల్లు ఘల్లు

ఇంట్లో
ప్రతి ఒక్కరి చేతిలో
సెల్లు ఘల్లు ఘల్లు
తిండి బడ్జెట్ కంటె
మిన్న అయిన
సెల్లు బిల్లు చూసి
యజమాని
గుండె ఝల్లు ఝల్లు

## చరిత్రలో చోటు

ప్రేమ విఫలమయినా
చరిత్రలో
చోటు
లైలా మజ్ను
సలీం అనార్కలి
పార్వతి దేవదాసు



ది.29.08.2010 వంగూరి ఫౌండేషన్
ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
అంతర్జాతీయ తెలుగు మహిళా
రచయితల కవి సమ్మేళనంలో
పాల్గొని ప్రముఖ రచయిత్రి
శ్రీమతి శారదా అశోక్ వర్ధన్ గారి
నుంచి మొమెంటో.



ప్రముఖ నటి, దర్శకురాలు
గిన్నిస్ బుక్ రికార్డు హోల్డరు
శ్రీమతి విజయ నిర్మలగారిని
సత్కరించిన సందర్భంగా



ఉగాది కవి సమ్మేళన సభలో
ప్రముఖ సినీ నటుడు, రచయిత
శ్రీ రావి కొండలరావు,
ప్రభుత్వ అదనపు కార్యదర్శి
శ్రీమతి ఎస్. రమాదేవి గార్లతో.



ప్రముఖ జ్యోతిషవేత్త
డా॥ సంధ్యాలక్ష్మి గారిని
సత్కరిస్తున్న సందర్భంగా

హార్ట్. 24-4-2010

# 'ఊహాల వసంతం' కవితా సంపుటి ఆవిష్కరణ

హైదరాబాద్, ఏప్రిల్ 23 (మేజర్‌న్యూస్ సిటీబ్యూరో) సచివాలయ ఉద్యోగిని శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ రచించిన 'ఊహాల వసంతం' కవితా సంపుటి శుక్రవారం రవీంద్రభారతి సమావేశహాలులో ఆవిష్కృతమైంది. ప్రముఖ నటుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు ఈ కవితా సంపుటిని ఆవిష్కరించగా, సాహితీ విమర్శకుడు ద్వానాశాస్త్రి సభాధ్యక్షులుగా వ్యవహరించారు. జీవీఆర్ ఆరాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ పుస్తకావిష్కరణ సభలో ఆంధ్రప్రభ సంపాదకుడు పి. విజయబాబుతోపాటు రాష్ట్ర సాంస్కృతికశాఖ సంచాలకులు డాక్టర్ ఎం. కాంతారావు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కినేని ప్రసంగిస్తూ.. ప్రకృతిలో అన్ని జీవరాశులతోపాటు పుట్టినప్పటికీ మన మానవ జాతికి మాత్రం ఇతర జీవులకు లేని బుద్ధిని ప్రకృతి ప్రసాదించిందని పేర్కొన్నారు. బుద్ధిజీవులైన మాన వులు మాటలు, ఊసులు, ఊహలు, లిపి, చిత్రలేఖనం వంటి ప్రత్యేక గుణాలను సంతరించుకున్నారని, ఆ పరిణామక్రమంలోనే మనకు భారత, రామాయణ గ్రంథాలు ఉద్భవించాయని అక్కినేని పేర్కొన్నారు. అలాగే సాహితీ సృజన లో పురుషులకంటె కవయిత్రులకు, రచయిత్రులకు ప్రత్యేకతలు ఉంటాయని, ఈ ఊహాల వసంతం రాసిన కేతవరపు రాజ్యశ్రీ రచనలో కూడా ప్రత్యేకత ఉందని అక్కినేని కొనియాడారు. సాంస్కృతికశాఖ సంచాలకులు డాక్టర్ ఎం. కాంతారావు మాట్లాడుతూ సాహితీ సృజన అనేది మన మానవ సమాజంలో ఓ సాంస్కృతిక సుద్గుణమని అభివర్ణించారు. అందునా స్త్రీల సాహితీ సృజనలో ప్రత్యేకమైన భావాలు, అభిరుచులు, అభిప్రాయాలు ఇమిడి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కవయిత్రి రాజ్యశ్రీ కవితల్లో సామాజిక కుటుంబ వ్యవస్థకు దర్పణకు పట్టే వాస్తవిక వస్తువైవిధ్యం ఇమిడి ఉంటుందని కొనియాడారు.



రవీంద్రభారతి సమావేశ హాలులో ఊహాల వసంతం కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న నటుడు అక్కినేని నాగేశ్వరరావు



"ఊహాలవసంతం" పుస్తకావిష్కరణసందర్భంగా

డా॥ అక్కినేని నాగేశ్వరరావుగారి చేత సత్కారం